క్లుప్తంగా

ఆవుపై చిరుత దాడి

గోరంట్ల: ఆవుపై చిరుత దాడి చేసి గాయపరిచిన సంఘటన గోరంట్ల మండలం ఎముకలగుట్లపపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. రాజశేఖరరెడ్డికి చెందిన ఆవును రాత్రి ఇంటి సమీపంలో కట్టివేసి ఉంచాడు. అయితే ఆవుపై చిరుత పులి దాడి చేసి శరీరంపైనా, పొదుగుపైనా గాయపరిచింది. అయితే ఆవు బిగ్గరగా అరవడంతో రాజశేఖరరెడ్డి వచ్చి చూడగా అప్పటికే ఆవుకు గాయాలయ్యాయి. వెంటనే అటవీ శాఖ, పశు వైద్య సిబ్బందికి సమాచారం అందించారు. ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ రాహుల్, గోపాలమిత్ర వెంకటేష్ ఆవుకు అయిన గాయాలను బట్టి చిరుతపులి దాడి చేసినట్లు నిర్ధారించారు. పులి సంచారంతో గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'బుల్లసముద్రం'



ట్రోఫీతో బుల్లసముద్రం జట్టు

మడకశిరరూరల్: మండల పరిధిలోని కోతులగుట్ట గ్రామంలో ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నిర్వహించిన అండర్-17 టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీలో బుల్లసముద్రం జట్టు విజేతగా నిలిచింది. సోమవారం నిర్వహించిన ఫైనల్ మ్యాచ్‌లో బుల్లసముద్రం - కోతులగుట్ట జట్లు తలపడ్డాయి. బుల్లసముద్రం జట్టు కోతులగుట్ట జట్టుపై 20 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. విజేతకు నిర్వాహకులు గంగాధర్, ప్రసన్న, తేజు, నారాయణ ట్రోఫీ అందజేశారు.

బైపాస్ రోడ్డులో ఎల్ఈడీ లైట్ల ఏర్పాటు

హిందూపురం టౌన్: పట్టణంలోని రహమత్‌పురం సర్కిల్ నుంచి వ్యవసాయ మార్కెట్ యార్డు వరకూ ఉన్న బైపాస్ రోడ్డుపై సోమవారం మున్సిపల్ సిబ్బంది ఎల్ఈడీ లైట్లను అమర్చారు. 31 పోల్స్‌కు రూ.40 లక్షలతో ఒక పోల్‌కు రెండు లైట్ల చొప్పున 62 ఎల్ఈడీ లైట్లను వేశారు.

బోరు బావికి నిప్పు



బోరు బావికి నిప్పుపెట్టడంతో కాలిపోయిన కేబుల్, కేసింగ్ పైపు

రొద్దం: మండల పరిధిలోని గొబ్బరంపల్లికి చెందిన శ్రీనివాసులు అనే రైతుకు సంబంధించిన వ్యవసాయ బోరు బావిని గుర్తు తెలియని వ్యక్తులు దగ్ధం చేశారు. ఈ ఘటనపై బాధిత రైతు సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బోరు బావికి ముళ్ల కంపలు వేసి నిప్పంటించడంతో మోటార్‌కు ఏర్పాటు చేసిన కేబుల్‌తో పాటు కేసింగ్ తదితర పరికరాలు కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశాడు. నిందితులను గుర్తించి చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు ముదిరెడ్డిపల్లిలో జ్యోతుల ఉత్సవం

హిందూపురం: మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లిలో చౌడేశ్వరీదేవి జ్యోతుల జాతర ఉత్సవం మంగళవారం పెద్ద ఎత్తున జరగనుంది. సోమవారం అర్ధరాత్రి 12 గంటలకు జ్యోతుల ఊరేగింపు ఉత్సవం ప్రారంభమవుతుందని నిర్వాహకులు తెలిపారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



మృతులకు నివాళులర్పిస్తున్న విశ్వ బ్రాహ్మణ సంఘం నాయకులు

మడకశిర: ఆర్థిక ఇబ్బందుల కారణంగా పట్టణంలో ఆదివారం స్వర్ణకారుడు క్రిష్ణాచారి కుటుంబ సభ్యులు నలుగురు ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విశ్వ బ్రాహ్మణ సంఘం పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు అరుణాచార్య సోమవారం మడకశిరకు వచ్చి మృతుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు నాగభూషణ్‌చారి, ఆదినారాయణ, చంద్రశేఖర్ ఆచారి, ఉమేష్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లు, దుకాణ వేళల్లో మార్పు

హిందూపురం అర్బన్: పట్టణంలో హోటళ్లు, దుకాణాలను మంగళవారం నుంచి రాత్రి 10 గంటలకు మూసివేయాలని డీఎస్పీ కేవీ మహేష్ ఓ ప్రకటనలో తెలిపారు. రంజాన్ మాసాన్ని దృష్టిలో ఉంచుకొని రాత్రి 10.30 గంటల వరకూ గతంలో పొడిగించామని పేర్కొన్నారు. రంజాన్ ముగియడంతో మంగళవారం నుంచి రాత్రి 10 గంటలకు మూసివేయాలని సూచించారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు.



హిందూపురం: ప్రార్థనల్లో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నేత వేణురెడ్డి



గోరంట్ల : ఈద్గాలో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు



లేపాక్షి: ఈద్గాలో ప్రార్థనలకు హాజరైన ముస్లింలు

భక్తిశ్రద్ధలతో ఈద్ - ఉల్ - ఫితర్

రంజాన్ పర్వదినాన్ని ముస్లింలు అత్యంత వైభవంగా జరుపుకున్నారు. హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోని అన్ని మసీదులు, ఈద్గాలు భక్తులతో కిటకిటలాడాయి. ముతవల్లీలు, మత పెద్దలు ప్రత్యేకంగా ప్రసంగించారు. అల్లా సూచించిన మార్గంలో పయణించడం ద్వారానే ఆయన ఆశీర్వాదం ఉంటుందన్నారు. ప్రార్థనల అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.



అమరాపురం: రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

- హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లో ఘనంగా రంజాన్ వేడుకలు
- ఈద్గా మైదానాల్లో సామూహిక ప్రత్యేక ప్రార్థనలు

హిందూపురం: పట్టణంలోని ఆల్‌హిలాల్, నింకంపల్లి, ముక్కిడిపేట, మేళాపురం తదితర ఈద్గా మైదానాల్లో సోమవారం ఉదయం రంజాన్ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచే ఆయా ప్రాంతాల నుంచి ర్యాలీగా ముస్లింలు మసీదులు, ఈద్గాలకు తరలివెళ్లారు. అల్ హిలాల్ ఈద్గా మైదానంలో సామూహికంగా ప్రార్థనలు చేశారు. ముస్లిం మతపెద్ద మౌలానా అబ్దుల్ మన్నన్ ప్రసంగిస్తూ అల్లా దృష్టిలో అందరూ సమానులేనని పేర్కొన్నారు. నెలరోజుల పాటు కఠినదీక్షలు పాటించిన ప్రతి ముస్లిం కుటుంబాలపై అల్లా ఆశీర్వాదాలు ఉంటాయన్నారు. ప్రతి ఒక్కరూ శక్తికొద్ది దానధర్మాలు చేసి తమ దాతృత్వాన్ని చాటుకోవాలన్నారు. ప్రార్థనల అనంతరం పరస్పరం ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

రొళ్ల: మండల కేంద్రం రొళ్లతో పాటు దొడ్డేరి, రత్నగిరి, ఆవినకుంట, గొట్టుగుర్కి, హెచ్‌టీ హళ్లి, బీజీ హళ్లి, హొట్టేబెట్ట, తూబినకుంట, ఎం.రాయాపురం తదితర గ్రామాల్లో సోమవారం ముస్లింలు ఘనంగా రంజాన్ వేడుకలను జరుపుకున్నారు. ఈద్గా మైదానాలకు తరలివెళ్లి ప్రత్యేక ప్రార్థనాలు చేశారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత, జెడ్పీటీసీ అనంతరాజు, పార్టీ మండల కన్వీనర్ నరసింహారెడ్డి, తాలూకా జేసీఎస్ బూత్ ఇన్‌చార్జ్ నాగేంద్ర, పార్టీ జిల్లా కార్యదర్శి లోకేష్ తదితరులు ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

ప్రార్థనల్లో పాల్గొన్న వేణురెడ్డి

చిలమత్తూరు: హిందూపురం పట్టణంలోని అల్‌హిలాల్ ఈద్గా మైదానంలో జరిగిన రంజాన్ వేడుకల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి పాల్గొన్నారు. ప్రార్థనల తర్వాత ముస్లింలను ఆలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆ తర్వాత ముతవల్లీ ఖలీంసాబ్, హుమయూన్ బాషా, మన్సూర్‌ఖాన్ నివాసాలకు వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, మైనార్టీ విభాగం వైఎస్సార్‌సీపీ ప్రెసిడెంట్ చాంద్‌బాషా, కౌన్సిల్ వైఎస్సార్‌సీపీ ఫ్లోర్ లీడర్ ఆసిఫుల్లా, నాయకులు శ్రీరామిరెడ్డి, ఫారూఖ్, అయూబ్ బేగ్, షబ్బీర్, మహేష్‌గౌడ్, చంద్రశేఖర్‌రెడ్డి, శబరీష్‌రెడ్డి, న్యాతరెడ్డి, శ్రీరాములు, రామకృష్ణారెడ్డి, ప్రణయ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి: మండల కేంద్రమైన లేపాక్షిలో సోమవారం ఉదయమే బస్టాండులో ఉన్న మసీదు వద్దకు ముస్లింల పెద్ద ఎత్తున చేరుకున్నారు. అనంతరం అల్లాను స్మరిస్తూ ఈద్గామైదానం వరకూ ర్యాలీగా బయలుదేరి వెళ్లారు. ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనల తర్వాత పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అదేవిధంగా కల్లూరు, శిరివరం, మానేపల్లి, పులమతి, కోడిపల్లి, మైదుగోళం తదితర ప్రాంతాల్లో ఈద్గాల వద్ద ప్రార్థనలు చేశారు.



పావగడ: ఈద్గాకు వెళ్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్

గోరంట్ల: మండల వ్యాప్తంగా సోమవారం ముస్లిం సోదరులు రంజన్ పర్వదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ముస్లిం సోదరులు ఉదయం ఎనిమిది గంటలకే ఆయా మసీదులకు చేరుకొని అల్లా నామస్మరణ చేసుకుంటూ కబరస్తాన్ వరకూ వెళ్లారు. అనంతరం అక్కడ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

పరిగి: మండలంలోని ముస్లింలు సోమవారం రంజాన్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే ముతవల్లీలు, మత పెద్దల ఆధ్వర్యంలో గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఆయా గ్రామాల మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈద్గాల్లో ముతవల్లీలు, మత పెద్దలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

పావగడ: పట్టణంలోని ఈద్గా మైదానంలో రంజాన్ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పెనుగొండ ఊరు వాకిలి నుంచి వందలాది మంది ముస్లింలు ఊరేగింపుగా శిరా రోడ్డు మీదుగా ఈద్గా మైదానానికి చేరుకున్నారు. అనంతరం మత పెద్దలు సమాజంలో ఎలా మసులుకోవాలో వివరించారు. తర్వాత సీఐ సురేశ్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు. అలాగే ఎమ్మెల్యే వెంకటేశ్, మాజీ మంత్రి వెంకటరమణప్ప వైఎన్ హొసకోటలో జరిగిన రంజాన్ వేడుకల్లో పాల్గొన్నారు.

మడకశిర: పట్టణంలో సోమవారం రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. పట్టణంలోని ఈద్గా మైదానంలో మత పెద్దలు నిర్వహించిన సామూహిక ప్రార్థనలో వందలాది మంది ముస్లింలు పాల్గొన్నారు. నెల రోజుల పాటు చేసిన ఉపవాస దీక్షలను విరమించారు. పరస్పరం పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.



పరిగి: ఈద్గా మైదానంలో ..

అమరాపురం: మండలంలోని ముస్లింలు రంజాన్ పండుగను సోమవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. అమరాపురంలోని జామియా, మక్కా మసీదుకు ముస్లింలు వందలాదిగా తరలివచ్చి ప్రార్థనల్లో పాల్గొన్నారు. మసీదుల నుంచి పురవీధుల గుండా వైఎస్సార్ సర్కిల్ సమీపంలోని ఈద్గా మైదానానికి చేరుకున్నారు. అక్కడ ముతవల్లీలు, మత పెద్దలు ప్రత్యేకంగా ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మహమ్మద్ ప్రవక్త బోధనలు, ఖురాన్ గ్రంథంలోని ముఖ్య విషయాలను వివరించారు. మండలంలోని బసవనపల్లి, హేమావతి, హెచ్‌బీఎన్ కాలనీ, వి.అగ్రహారంలో ప్రార్థనలు జరిగాయి.

రొద్దం: మండల కేంద్రంలోని జామియ మసీదు నుంచి పావగడ-పెనుకొండ ప్రధాన రహదారి పక్కనున్న ఈద్గా మైదానికి సోమవారం ఉదయమే ముస్లింలు ర్యాలీగా తరలివెళ్లారు. ముతవల్లీ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ముస్లింలు పరస్పరం ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు చెప్పుకున్నారు.

పెనుకొండ: పట్టణంలో సోమవారం రంజాన్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఉదయమే ముస్లింలు పెద్ద సంఖ్యలో ర్యాలీగా ఈద్గా వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ముతవల్లి రంజాన్ విశిష్టత, ప్రాధాన్యతను వివరించారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తే నిర్వహించారు.



అమరాపురం: పానకాన్ని పంపిణీ చేస్తున్న దృశ్యం



రొళ్ల మండలం ఆర్.వద్రహట్టి గ్రామంలో..



లేపాక్షి: ఈద్గా మైదానంలో చిన్నారుల సందడి



పెనుకొండలో బందోబస్త్ పర్యవేక్షిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు



అమరాపురంలో ర్యాలీగా వస్తున్న ముస్లింలు



అగళి: ఈద్గాకు ర్యాలీగా వెళ్తున్న దృశ్యం



పెనుకొండ: ప్రత్యేక ప్రార్థనల్లో ముస్లింలు



రొద్దం: ఈద్గా మైదానంలో ప్రసంగిస్తున్న ముతవల్లి



గుడిబండ: ఈద్గాకు ర్యాలీగా వెళ్తున్న ముస్లింలు


ఆంజనేయస్వామికి పూజలు

అమరాపురం: మండల పరిధిలోని తమ్మడేపల్లిలో వెలసిన ఆంజనేయస్వామి ఉత్సవాల్లో భాగంగా సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు స్వామి వారికి ఉదయం నుంచి వివిధ రకాల అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం పూలతో అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. అలాగే ఉదుగూరు గ్రామంలోని కెంచమాంబదేవి అమ్మవారికి భక్తులు పూజలు చేశారు. వచ్చిన భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ప్రసాద వినియోగం చేశారు.

వక్ఫ్ సవరణ బిల్లు రద్దు చేయాలి

లేపాక్షి: రాజ్యాంగం ముస్లింలకు ప్రసాదించిన హక్కులను వక్ఫ్ సవరణ బిల్లుతో కాలరాసే కుట్ర జరుగుతోందని, వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు రద్దు చేయాలని ముస్లింలు డిమాండ్ చేసారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయంకు వ్యతిరేకంగా సోమవారం ఉదయం నల్లబ్యాడ్జీలతో లేపాక్షి మసీదు వద్ద నిరసన తెలిపారు. బిల్లును తక్షణమే కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించు కోవాలన్నారు.

ఘనంగా బైలాంజనేయస్వామి ఉరుసు



అలంకరణలో బైలాంజనేయస్వామి

పరిగి: మండలంలోని మోదాలో వెలసిన బైలాంజనేయస్వామి ఉరుసు ఉత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పంచాయతీ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలో ఉదయమే స్వామి వారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకరణ, పూజలు చేశారు. అనంతరం సీతారాముల ఉత్సవ విగ్రహాలను వెండి రథంపై ఊరేగించారు. పెద్ద ఎత్తున భక్తులు పాల్గొని స్వామి వారిని దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

అక్రమ కేసులు ఎత్తివేయాలి

- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహామూర్తి

మడకశిర: రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక సందర్భంగా వైఎస్సార్‌సీపీ జిల్లా నాయకులపై అక్రమంగా నమోదు చేసిన కేసులను వెంటనే పోలీసులు ఎత్తి వేయాలని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహామూర్తి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి తదితరులపై పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడం అన్యాయమన్నారు. రామగిరి ఎంపీపీ ఉప ఎన్నిక సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఎంపీటీసీలను కూటమి నాయకులు అదుపులో ఉంచుకుని ఎన్నిక జరగకుండా ఆటంకాలు సృష్టించిన విషయాన్ని వైఎస్సార్‌సీపీ జిల్లా నేతలు ప్రశ్నించడమే తప్పుగా భావించి పోలీసులు అక్రమ కేసులు నమోదు చేయడం సరికాదన్నారు. అక్రమ కేసులన్నీ ఎత్తి వేసి ప్రజాస్వామ్యాన్ని కాపాడాలని కోరారు.

లక్ష్మీనరసింహస్వామి దర్శనం నిలిపివేత

మడకశిరరూరల్: మండల పరిధిలోని భక్తరపల్లి లక్ష్మీనరసింహస్వామి , జిల్లేడుగుంట ఆంజనేయస్వామి దేవాలయాల్లో భక్తులకు సోమవారం నుంచి బుధవారం వరకూ స్వామి వార్ల దర్శనం నిలిపి వేస్తున్నట్లు ఈఓ నరసింహరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఆలయాల్లో పని చేస్తున్న అర్చకుల్లో నాలుగు కుటుంబాల్లో ఒకరైనా అర్చకుడు నారాయణప్ప మృతి చెందాడన్నారు. దీంతో మూడు రోజులు ఆలయాల్లో భక్తులకు స్వామి వార్ల దర్శనం నిలిపివేశామన్నారు. బుధవారం ఆలయాలను పరిశుభ్రం చేసి 3వ తేదీ నుంచి భక్తులకు పున: దర్శనం కల్పిస్తామన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడు మృతి



దేవరాజు మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప

గుడిబండ: మండల పరిధిలోని మోపురుగుండు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు మాజీ డీలర్ దేవరాజు (48) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈరలక్కప్ప, మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు మోపురుగుండు గ్రామానికి చేరుకుని దేవరాజు మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. మృతుడు దేవరాజుకు భార్య శ్యామలమ్మ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఈ సందర్భంగా ఈరలక్కప్ప మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ కరుణాకర్ గౌడు, నాయకులు తిప్పేస్వామి, లింగరాజు, విశ్వనాథ, శ్రీరామప్ప, లింగన్న, కరిలింగప్ప, మంజునాథ్ తదితరులు ఉన్నారు.

దొడ్డీరమ్మకు జ్యోతుల ఉత్సవం



అలంకరణలో దొడ్డీరమ్మదేవి

రొళ్ల: మండల పరిధిలోని దొడ్డేరి గ్రామ సమీపంలో వెలసిన దొడ్డీరమ్మదేవికి సోమవారం సాయంత్రం మహిళలు జ్యోతుల ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. దొడ్డేరి, కొత్తపల్లి, పిల్లిగుండ్ల, రంగనపల్లి, వెంకటంపల్లితో పాటు కర్ణాటక ప్రాంతం నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారికి జ్యోతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవానికి హాజరైన భక్తులకు ఆలయ కమిటీ ద్వారా అన్నదానంతో పాటు పానకం, మజ్జిగ అందజేశారు.

అపూర్వ సమ్మేళనం



గురువులను సన్మానించిన పూర్వ విద్యార్థులు

మడకశిర: పట్టణ పరిధిలోని బేగార్లపల్లి ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థులు సోమవారం గురువులను ఘనంగా సన్మానించారు. 2011 నుంచి 2017 మధ్య ఈపాఠశాలలో 1 నుండి 7వ తరగతి వరకూ చదువుకున్న వారంతా పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. పాత జ్ఞాపకాలను విద్యార్థులు, ఉపాధ్యాయులు నెమరవేసుకున్నారు. కార్యక్రమంలో ప్రస్తుత పాఠశాల హెచ్‌ఎం వెంకట్రాముడు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా నృసింహుడి కల్యాణం

హిందూపురం: పట్టణ సమీపంలోని కొట్నూరులోని రాజ్యలక్ష్మి సమేత నరసింహస్వామి దేవస్థానంలో లక్ష్మీ నరసింహస్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం లక్ష్మీ నరసింహస్వామి ఉత్సవమూర్తులను కొలువుదీర్చి అర్చకులు కల్యాణోత్సవం నిర్వహించారు.



కల్యాణోత్సవం నిర్వహిస్తున్న పండితులు



హాజరైన భక్తులు



ఉష్ణోగ్రత సమాచారం

హిందుపురం	38.0
పెనుకొండ	40.0
మడకశిర	38.0

పేకాట రాయుళ్ల అరెస్ట్

హిందూపురం అర్బన్: పట్టణంలోని కెంచా కళ్యాణ మంటపం శివారులో సోమవారం రాత్రి జూదం ఆడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.18,760 నగదు, 12 ద్విచక్ర వాహనాలు 6 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. ఏడుగురిని అదుపులోకి తీసుకున్నామని, మరికొందరు తప్పించుకున్నారని త్వరలో వారిని కూడా అదుపులోకి తీసుకుంటామన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు

హిందూపురం అర్బన్: పట్టణంలోని ప్రధాన కూడళ్లలో సోమవారం ఐదు చలివేంద్రాలు పురపాలక సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. ప్రజలు వివిధ పనుల నిమిత్తం పట్టణానికి వస్తుండటంతో వారి దాహార్తి తీర్చడం కోసం పట్టణంలోని రహమత్‌పూర్, ఎన్టీఆర్ సర్కిల్, చిన్నమార్కెట్, బీపీఎల్ షోరూం, ఆర్టీసీ బస్టాండ్ వద్ద చలివేందాలు ఏర్పాటు చేసి ఫిల్టర్ వాటర్ అందిస్తున్నట్లు మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్, కమిషనర్ శ్రీనివాసులు తెలిపారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

హిందూపురం: విశ్వావసు నామ సంవత్సర త్రైత శకం 47వ సంవత్సర తెలుగు ఉగాది క్యాలెండర్లను కొట్నూరులో సోమవారం ఆవిష్కరించారు. ప్రబోదానంద యోగీశ్వర భక్తమండలి త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ముద్దిరెడ్డి పల్లి కమిటీ సభ్యులచే కొట్నూరులో తెలుగు ఉగాది క్యాలెండర్లను పంపిణీ చేశారు.

6న జిల్లాస్థాయి ఎడ్ల బండ్ల పోటీలు

గోరంట్ల: శ్రీరామ నవమిని పురస్కరించుకొని మండల పరిధిలోని కరావులపల్లి తండా సమీపంలోని శివ, ఆంజనేయస్వామి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 6న జిల్లాస్థాయి ఎడ్ల బండ్ల పోటీలను నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త డాక్టర్ సునితా శంకలాల్‌నాయక్ తెలిపారు. ఆలయ వార్షికోత్సవాన్ని కూడా జరిపిస్తామని పేర్కొన్నారు. ఎడ్లబండ్ల పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు వరుసగా రూ.లక్ష , రూ.70 వేలు, రూ.50 వేలు, రూ.40 వేలు అందజేస్తామన్నారు. పోటీల్లో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న రైతులు ఒక్కో బండికి రూ. 2 వేలు రుసుము చెల్లించాల్సి ఉంటుందన్నారు. పోటీల్లో పాల్గొనే రైతులు పేర్లు నమోదు చేసుకోవడానికి సెల్ నంబర్ 9912187783ను సంప్రదించాలని కోరారు.